

ప్లాస్టిక్ వాడకం తగ్గించండి : కలెక్టర్



కృష్ణా కాలువ వద్ద శుభ్రం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టూటౌన్/ ఏలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆరోగ్యకర జీవన విధానానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కలెక్టర్ వెట్రి సెల్వి ప్రజలకు పిలుపు నిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణకాలువ గట్లపై కలెక్టర్‌తో సహా మున్సిపల్ సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించడం, పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, కోఅప్షన్ సభ్యుడు పెదబాబు, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, నగర కమిషనర్ భానుప్రతాప్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో శనివారం



కృష్ణా కాలువను శుభ్రపరుస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి

కలెక్టర్ వెట్రిసెల్వి మొక్కలు నాటారు. ఈ-చెక్ థీమ్ కింద వివిధ శాఖల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఏరివేతను కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు.

ప్రజా భాగస్వామ్యం ముఖ్యం : మంత్రి కొలుసు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి) : ప్రతి మూడో శని వారం ఒక కొత్త ఆలోచనతో స్వచ్ఛందంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ముందుకు సాగుతోందని, దీనికి ప్రజా భాగస్వామ్యం ముఖ్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లిలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసర ప్రాంతాలను శుభ్రపర్చి చెత్తను ట్రాక్టర్‌పై వేశారు. రోడ్లపై ప్లాస్టిక్ సంచులను తొలగించారు. చెత్తను రోడ్లపై వేయొద్దని దుకాణాదారులకు సూచించారు. సర్పంచ్ చౌటపల్లి విజయలక్ష్మి, చౌటపల్లి విక్టర్‌బాబు, ఏపీవో మీనాక్షి, తహసీల్దార్ ప్రసాద్, ఈవో ప్రసాద్, నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు, చిట్నేని శివరామ కృష్ణ, మడుపల్లి గోపాల్, ముల్లంగి శ్రావణ్ కుమార్, పామర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో రోడ్లపై చెత్తను శుభ్రం చేస్తున్న మంత్రి పార్థసారథి

థాంక్యూ సీఎం సర్

మెగా డీఎస్సీ - 2025 నోటిఫికేషన్ నేడే విడుదల

- పాఠశాల విద్యలో 1035 పోస్టులు, జువనైల్ హోం స్కూలులో 7 పోస్టులు
- సంక్షేమ పాఠశాలల్లో మరో 348 జోనల్ పోస్టులు
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఖరారైంది. అధికారికంగా ఆదివారం జారీ చేస్తారు. ఆదివారం నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, మాక్ టెస్టు మే 20 నుంచి ఉంటాయి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లు జూన్ ఆరు నుంచి జూలై 6వ తేదీ వరకు జరుగుతాయి. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వెలువడిన ఈ నోటిఫికేషన్‌తో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సంతకం చేసిన తొలిఫైలు మెగా డీఎస్సీనే కాగా, తొలుత ప్రకటించిన పోస్టులకంటే అదనంగా మరిన్ని యాజమాన్యాల్లోకూడా ఉపాధ్యాయ ఖాళీల ను భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌లో పోస్టులను చేర్చడం బంపర్ ఆఫర్‌గా చెప్పవచ్చు. ఆ ప్రకారం పాఠశాలవిద్యాశాఖలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయా యాజమాన్యాలు, సబ్జెక్టుల వారీగా మొత్తం 1035 పోస్టుల భర్తీకి శనివారం రాత్రి నోటిఫికేషన్ జారీచేశారు. వీటితోపాటు జువనైల్ హోం(బాలురు) పాఠశాలలో మరో ఏడు పోస్టులు, మూడు జిల్లాల పరిధిలోని వివిధ సంక్షేమ వసతి గృహాల పాఠశాలకు ఉద్దేశించిన 348 జోనల్ పోస్టులను మెగా డీఎస్సీలో భర్తీ చేసేలా నోటిఫై చేశారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ/జడ్పీ/మండల పరిషత్/మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 1035 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఫస్ట్ లాంగ్వేజి 42 పోస్టులు, సెకండ్ లాంగ్వేజి 61, ఇంగ్లీషు 84, గణితం 40, ఫిజికల్ సైన్సు 40, బయోలాజికల్ సైన్సు 64, సోషల్ స్టడీస్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 181 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 420 పోస్టులను నోటిఫై చేశారు.

కొత్తగా మరిన్ని పోస్టులు ఇలా..

ప్రభుత్వ బాలుర వసతి గృహం (జువనైల్ హోం)లకు మంజూరైన ఎస్జీటీ పోస్టుల్లో దశాబ్దాల కాలంగా డిప్యూటేషన్లపై టీచర్లతో బోధిస్తుండగా, తొలిసారిగా ఈ పోస్టులను శాశ్వతప్రాతిపదికన భర్తీ చేస్తూ మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో నోటిఫై

-మిగతా 10లో

టిడ్కో ఇళ్లకు మోక్షం

- జూన్ 2 లోగా ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- నెరవేరనున్న లబ్ధిదారుల కల

టిడ్కో గృహాలకు మోక్షం లభించనుంది. ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు ఊరట కలగనుంది. జూన్ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు గృహాలందించేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను ప్రారంభించింది. 2019 నాటికి 90 శాతం నిర్మాణాలు పూర్తి చేసింది. ఇక గృహ ప్రవేశమే తరువాయి అని భావించిన తరుణంలో ఎలక్షన్ కోడ్ వచ్చింది. ఆపై అధికారంలోకి వచ్చిన టిడ్కో గృహాలను ఇస్తే చంద్రబాబు కట్టిన ఇళ్లు అని ముద్ర పడుతుందనే దురాలోచనతో లబ్ధిదారులకు వాటిని ఇవ్వలేదు. ఈ ఆరేళ్లలో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో వీటికి మరల కదలిక వచ్చింది.

ఏలూరులో 4,272 మంది గగ్గోలు

ఏలూరు టూటౌన్ : అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని సాధారణ ఎన్నికల ముందు కూటమి నాయకులు వాగ్దానం ఇచ్చారు. ఆ ప్రకారం కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహాల కోసం రూ.102 కోట్లు విడుదల చేసింది. జూన్ నెలాఖరుకల్లా నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. ఆ మేరకు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వడానికి పనులు ప్రారంభించారు. జిల్లాలో ఏలూరులోను, జంగారెడ్డిగూడెంలో టిడ్కో గృహాలను నిర్మించారు. ఏలూరులో అప్పటి టీడీపీ ప్రభుత్వం 11,816 ఇళ్లను మంజూరు చేసి మొదటి విడతగా 6,480 ఇళ్లను



ప్రారంభించింది. వీరందరి చేత లబ్ధిదారుల వాటాలు కట్టించుకుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4,272 ఇళ్లను రద్దు చేసి 2,208 మందికి మాత్రమే ఇళ్లు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. లబ్ధిదారుల వాటా చెల్లించిన మిగిలిన లబ్ధిదారులు లబోదిబోమన్నారు. మరి వీరికి టీడీపీ ప్రభుత్వం సొమ్ములు వెనక్కి ఇస్తుందో లేక ఇళ్లను కేటాయిస్తుందో వేచి చూడాలి.



• జంగారెడ్డిగూడెంలో 864 ఇళ్లు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలోని టిడ్కో ఇళ్లు లబ్ధిదారుల కల నెరవేరబోతుంది.టిడ్కో ఇళ్ల నిర్మాణంలో కదలిక మొదలైంది. 2018 టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో రెండో ఫేజ్‌లో 864 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆపై 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పట్టించుకోక పూర్తిగా వదిలేసింది.దీంతో డీడీలు ద్వారా డబ్బు చెల్లించిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై దృష్టి సారించింది. జూన్ రెండు నాటికి టిడ్కో ఇళ్లను పూర్తిచేయా లని జంగారెడ్డిగూడెం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే కాంట్రాక్టర్లు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. 2017-18లో రూ.70.19 కోట్లతో 864 టిడ్కో ఇళ్లన నిర్మాణం చేపట్టగా 2018లోనే రూ.45.86 కోట్ల పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.24.33 కోట్ల పనులు నిలిచిపోయాయి. అయితే నిలిచిన పనులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మరో రూ.పది కోట్ల వరకు వ్యయం పెరిగే అవకాశాలున్నాయని, మౌలిక సదుపాయాలు, నీటి శుద్ధి కేంద్రానికి మరో రూ.పది కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు రెండో విడత బుకింగ్ ప్రారంభం

ఏలూరు సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గతేడాది డిసెంబరు నుంచి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రెండో విడత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమైంది. జూలై 31వ తేదీలోగా గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి రెండో విడత గ్యాస్ సిలిండర్‌ను అందిస్తారు. ఇప్పటికే జిల్లాలో రెండో విడతకు సంబంధించి గ్యాస్ బుకింగ్‌లు ప్రారంభ మైనట్టు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ పథకంలో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదిలో మూడు సిలిండర్లు అర్హులైన లబ్ధిదారులకు ఇస్తారు. మొదటి విడత గ్యాస్ సిలిండర్‌ను గతేడాది డిసెంబరు నుంచి మార్చి 31వ తేదీలోగా బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు గ్యాస్ ఏజెన్సీలు సరఫరా చేశాయి. జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హులు 4,02,000 మంది వరకు ఉన్నారు. జిల్లాలో తొలి విడత 3,96,799 మంది (98.7 శాతం) ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. లబ్ధిదారుడు గ్యాస్ సిలిం డర్‌కు సొమ్ము చెల్లించినా ఆపై దానికి సంబంధించి 31 కోట్ల 44లక్షల 2వేల 318 రూపాయలు సబ్సిడీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతా లకు జమ చేసింది. అయితే ఇంకా కొంత మందికి రూ.3,91,352 వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

డీవీఈవోల నియామకాలకు రంగం సిద్ధం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్ విద్యా శాఖాదికారి (డీవీఈవో) నియామకం సోమ, మంగళవారాల్లో జరిగే అవకాశం ఉందన్న సంకేతాలు వస్తున్నాయి. రెగ్యులర్ ప్రాతిపదికన డీవీఈవో వేకెన్సీలను భర్తీ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 19 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కూడిన సీనియార్టీ జాబితాలను తయారుచేసిన ప్రభుత్వం ఆ మేరకు పదోన్నతిపై భర్తీచేయనున్న ఈ పోస్టులకు తొలి వరుసలో వున్న ప్రిన్సిపాళ్లు ఒక్కొక్కరి నుంచి మూడుచొప్పున జిల్లాలకు అభీష్టాలను తీసుకున్నట్టు తెలిసింది. ఈ ఆప్షన్స్ నుంచి ప్రాధాన్యతాక్రమంలో డీవీఈవోల నియామకాలకు జిల్లాల కేటాయింపులు జరగనున్నాయి. ఈ మేరకు గుంటూరు జిల్లాకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్‌బాబు ఏలూరు జిల్లాకు డీవీఈవోగా నియమితుల య్యే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. నియామ కాల పై అధికారిక ప్రకటన విడుదల కావాల్సి ఉంది.

ఆగని మట్టి మాఫియా

- ఈదర పంగిడమ్మ చెరువును కొల్లగొడుతున్నవైనం.. కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

నూజివీడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామ సమీపంలోని పంగిడమ్మ చెరువు మట్టిని సైతం ఆగిరిపల్లి మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు గత ఇరవై రోజుల నుంచి రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా అక్రమ మైనింగ్ జరుపుతూ మట్టిని అమ్ముకుంటున్నారు. నరసింగపాలెంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ గురించి శనివారం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో శనివారం సాయంత్రం ఈదర, సీతారామపురం గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్థులు పంగిడమ్మ చెరువు అక్రమ మట్టి తవ్వకాల గురించి కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదు చేశారు. టిప్పర్ మట్టి రూ.12 వేలకు అమ్మి నట్టు సమాచారం. దీనిలో టిప్పర్, ఎక్స్‌కవేటర్ ఖర్చు, అధికారుల మామూళ్ళు రూ.6వేలు పోగా మిగిలిన రూ.6వేలను జేబులో వేసుకుంటున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. కనీసం ఇరవై టిప్పర్‌లు రాత్రివేళల్లో ఒక్కొక్కటి రెండు ట్రిప్పుల మట్టిని మాదాలవారిగూడెం, వెల్వడం గ్రామాల్లోని ఇటుకబట్టీలకు తరలిస్తున్నట్టు గ్రామస్థులు తెలిపారు.

డీఫారం పట్టా భూమిని తవ్వేశారు

నరసింగపాలెం అక్రమ క్వారీయింగ్‌లో, తవ్వకం దారులు ఈ గట్టుకు ఆనుకుని ఉన్న డీఫారం పట్టా భూమిలోని మట్టిని సైతం ఆ రైతుకు తెలియకుండానే తవ్వి అమ్మేశారు. ఈ విషయం శనివారం గ్రహించిన భూమి యజమానికి నరసింగపాలెం గ్రామస్థులు మద్దతు నిలిచారు. ఈ మేరకు శుక్రవారం పట్టుకున్న ఎక్స్‌కవేటర్‌ను వదలకుండా పట్టా భూమిలోని తవ్విన మట్టికి డబ్బు చెల్లించాలని స్పష్టం చేశారు. విడతలుగా రూ.2.50 లక్షలు ఇస్తానని అక్రమ మైనింగ్ దారుడు ప్రతిపాదించగా ఒకేసారి రైతుకు చెల్లించి ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్ళాలని గ్రామస్థులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్యకు మోక్షం

- పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం




మురుగునీటి తరలింపునకు చేపట్టిన పైప్‌లైన్ పనులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్ర జ్యోతి) : నూజివీడు పట్టణంలో దాదాపు 18 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న నూజివీడు ట్రిపుల్ ఐటీ మురుగునీటి తరలింపు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి మురుగునీటిని తరలించేలా రూ.3.7 కోట్ల నిధులతో పైప్‌లైన్ ఏర్పాటు పనులను నూజివీడు మునిసిపల్ అధికారులు ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీ నుంచి ఏరియా హాస్పిటల్ మీదుగా పెద్ద చెరువు కళంగి వరకు పైప్‌లైన్ ఏర్పాటుకు సంబంధించి పనులను నిర్వహిస్తున్నారు. 2008లో ప్రారంభమైన నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రస్తుతం దాదాపు 8,000 మంది విద్యార్థులు మరో 2,000 మంది సిబ్బంది ఉంటున్నారు. వీరు ఉపయోగిస్తున్న నీటిని ప్రస్తుతం బయటకు ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నా వర్షాకాలంలో పట్టణంలోని గొడుగువారిగూడెం, గాంధీనగర్ తదితర ప్రాంతాలను మురుగునీరు ముంచెత్తుతోంది. దీంతో పలుమార్లు ఆయా ప్రాంతాల వాసులు నిరసనలకు దిగారు. పదేళ్ల క్రితం ప్రత్యేకంగా పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరైనా పైప్‌లైన్ నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి అనంతరం పైప్‌లైన్ నిర్మాణ పనులకు టెండర్ పిలవగా ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.

అభివృద్ధిలో.. బాబు ముద్ర

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.. సాగునీటి వనరులు, విద్య, వైద్యం, రహదారులపై దృష్టిపెట్టి తమదైన ముద్ర వేశారు.. తమ గ్రామంలో తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులను ఎప్పటికీ మరిచి పోలేమని చంద్రబాబు అభివృద్ధి ప్రధాత అంటూ ప్రజలు తలుచుకుంటూ ఉంటారు.. నేడు ఆయన పుట్టినరోజు.. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల్లో ఆయన హయాంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిలిచిన కొన్ని పనులపై ఆంధ్రజ్యోతి పరిశీలన...



చంద్రబాబు ముఖ్యమంత్రిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు

ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం



పట్టిసీమతో రాయలసీమకు నీరు

పోలవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు పోలవరం ప్రాజక్టు నిర్మాణం వల్లే కలిగింది. పోలవరం ప్రాజక్టు నిర్మాణం పూర్తయ్యేలోగా రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా, రాయలసీమ జిల్లాలకు సాగునీటి కొరత లేకుండా టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం నిర్మించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకమునుపే రాయలసీమకు ప్రాంతాలకు సాగు నీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముందుగా తరలించిన పైడిపాక గ్రామాన్ని పోలవరం మండలం పాత తోటగొంది గ్రామానికి సమీపంలో 254 కాలనీలతో నిర్మించి మౌలిక వసతులు కల్పించారు. దీంతో ఆయన మీద అభిమానంతో ఆ గ్రామస్థులు పైడిపాక చంద్రన్న కాలనీగా పేరుపెట్టుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. పోలవరం పరిసర ప్రాంతాల్లో సాగునీటి అవసరాల కోసం కొత్తూరు చెరువు ఆయకట్టుకి పోలవరం ప్రాజక్టు కుడి కాలువ నుంచి లాకులు ఏర్పాటు చేసి సాగునీటి అవసరాలు తీర్చారు. గ్రామానికి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్ ప్రమాదకరంగా ఉండడంతో దానికి అవసరమైన ప్రాంతాల్లో రాళ్ళతో రక్షణ మార్గం ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితమివ్వాలనే తపనతో గతంలో టీడీపీ అధికారంలో ఉండగానే పనులు వేగవంతం చేసి రెండుసార్లు కాంక్రీట్ పనులు వేగవంతంగా జరిపించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ప్రాజక్టుని ఎక్కించి పోలవరం వైపు ప్రపంచమంతా చూసేలా చేశారు చంద్రబాబు.



పోగొండ జలాశయం

'పోగొండ'తో ఏజెన్సీకు సాగునీరు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటికి అర్రులు చాచిన పొలాలు, వర్షాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన రైతులు నేడు పుష్కలంగా సాగునీరు అందడంతో అదురు బెదురు లేకుండా పంటలు పండిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీలో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న పోగొండ జలాశయం పూర్తిచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కుతుందని ఏజెన్సీవాసులు గట్టిగా నమ్ముతారు. బైనేరు కొండవాగు ద్వారా వృథాగా పోతున్న వేలాది క్యూసెక్కుల నీటిని జలాశయం నిర్మాణం ద్వారా రైతులకు సాగునీటిని అందించాలని 2008లో 26 కోట్లతో వైఎస్ రాజశేఖరరెడ్డి పనులు ప్రారంభించగా ఆయన మరణంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తర్వాత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక పోగొండ పనులు పరుగులు పెట్టాయి. అంచనా వ్యయం కూడా రూ.138 కోట్లకు చేరినా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఆయన 2018 ఫిబ్రవరిలో జలాశయాన్ని పూర్తిచేసి రైతులకు అంకితం చేశారు. జలాశయం నిర్మాణం పూర్తికావడంతో కుడి, ఎడమ కాల్వల ద్వారా 4 వేల ఎకరాలకు, స్థిరీకరణ ద్వారా 3,600 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది.



ముత్యాలపల్లి-వారతిప్ప గ్రామాల మధ్య బ్రిడ్జి

వారతిప్ప, వెంప, కొత్తపాలెం వంతెనలతో తీరగ్రామాల అనుసంధానం

మొగల్తూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానంతోనే తీరంలో గ్రామాల అనుసంధానం కల సాకారమైంది భీమవరం-మొగల్తూరు మండలాలకు అనుసంధానంగా ముత్యాలపల్లి-వారతిప్ప గ్రామాలను కలుపుతూ గొంతేరు కాలువపై రూ.3.50 కోట్లుతో 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో వంతెన నిర్మాణం చేపట్టి కొద్ది నెలలకే పూర్తి చేశారు. దీంతో మండలంలోని అతి చిన్న గ్రామం అయిన వారతిప్ప వాసులకు ఎంతో ప్రయోజనం కలిగింది. ఈ వంతెన నిర్మాణం ద్వారా పేరుపాలెం, కేపీపాలెం, ముత్యాలపల్లి వంటి తీర గ్రామాల ప్రజలు నేరుగా భీమవరం వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యింది. భీమ వరం మండలం వెంప మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామాల మధ్య డ్రెయిన్‌పై ఒక బ్రిడ్జిని 1998లోనూ మొగల్తూరు మండలం కొత్తపాలెం-భీమ వరం మండలం వెంప గ్రామాల మధ్య గొంతేరు డ్రెయిన్‌పై మరో బ్రిడ్జి నిర్మించి మొగల్తూరు భీమవరం మండలాలకు అనుసంధానంతో పాటు తీర గ్రామాల అనుసంధానానికి వంతెనలు, రహదారుల నిర్మాణం పూర్తి చేశారు.



నామవరం బహిరంగ సభలో మాట్లాడుతున్న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఫైల్)

అడవుల రక్షణకు చంద్రోదయం

చింతలపూడి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబుతో చింతలపూడి జ్ఞాపకంలో ప్రధానమైనది రాష్ట్రంలో ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం. 1992లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అడవులను కూడా బాగు చేసేందుకు వామపక్షాలతో కలిసి ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాన్ని తీసుకువచ్చారు.ఈ పథకాన్ని రాష్ట్రంలో చింతలపూడి మండలం నామవరం గ్రామంలోని బత్రికొండ ఫారెస్టులో ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న అటవీ భూముల్లో వనసంరక్షణ సమితులు ఏర్పాటు చేసి చెట్లను పెంచి వాటి ఫల సాయాన్ని సమితి సభ్యులు అటవీ శాఖ పంచుకునే విధంగా ఈ పథకం రూపొందించారు. పథకం ప్రారంభం సందర్భంగా బత్రికొండలోనే పైలాన్ ప్రారంభించి ఆ పైలాన్‌కు వన చంద్రోదయం అని నామకరణం చేశారు. వామపక్షాలైన సీపీఐ, సీపీఎం ఈ పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నాయి.



విద్యా ప్రగతిలో మైలురాయి..ఏపీ నిట్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీనిట్)విద్యార్థులకు వరంగా మారింది. 2014లో రాష్ట్రం విడిపోయిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిలో చంద్రబాబ నాయుడు బాధ్యతలను చేపట్టారు. అప్పటికి ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌లోనే నిట్ ఉండేది. రాష్ట్రం విడిపోయిన అనంతరం ఏపీ కూడా నిట్ కావాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు చొరవ మేరకు అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 2015లో ఏపీకి నిట్‌ను కేటాయించింది. అయితే నిట్ నిర్మాణం కోసం అప్పుడు ఏలూరు, తాడేపల్లిగూడెంల మధ్య పోటీ నెలకొంది. అప్పుడు రాష్ట్ర మంత్రిగా ఉన్న పైడికొండల మాణిక్యాలరావు చొరవతో ఏపీ నిట్‌ను తాడేపల్లిగూడేనికి దక్కింది. నిట్ నిర్మాణం కోసం పట్టణంలో ఉండే 172 ఎకరాల విమానాశ్రయ భూములను కేటాయించారు. తొలి విడతగా నిర్మాణం కోసం రూ.435 కోట్లు కేటాయించారు. 2016లో నిట్ నిర్మాణం పూర్తి చేసుకుంది. ప్రస్తుతం దక్షిణాదిలోనే మెరుగైన సంస్థగా పేరు గాంచి అవార్డు కూడా సొంతం చేసుకుంది. సీఎం చంద్రబాబు పాలనకు గుర్తుగా తాడేపల్లిగూడెం వాసులకు శాశ్వత చిహ్నంగా ఏపీ నిట్ నిలిచింది.



గుర్తుండిపోయే విద్య, వైద్య భవనాలు

తణుకు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నపుడు తణుకు పట్టణంలో నిర్మించిన రెండు ప్రధాన నిర్మాణాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. 1999వ సంవత్సరంలో ముళ్ళపూడి వెంకట కృష్ణారావు ఎమ్మెల్యేగా ఉన్నపుడు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మాణం చేశారు. 2002లో వైటీ రాజా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దాతలు,జన్మభూమి నిధులతో తణుకు బాలురున్నత పాఠశాల నిర్మాణం చేపట్టారు.ఆనాటి నుంచి ఈనాటి వరకు ఈ భవనాలు చెక్కు చెదరలేదు. రెండు భవనాల నిర్మాణం గురించి మాట్లాడుకుంటే తణుకు పట్టణ ప్రజలు ఖచ్చితంగా చంద్ర బాబును తలుచుకుంటారు..

వేల్పూరుకు బైపాస్

తణుకు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వేల్పూరు గ్రామంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.18 కోట్లతో సుమారు 3 కిలోమీటర్ల మేర గ్రామానికి సమాంతరంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. చంద్రన్న పచ్చతోరణం పథకంలో వేల్పూరు గ్రామంలోని ప్రధాన వీధుల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.గత ప్రభుత్వంలో రివర్స్ టెండరింగ్ విధానం అమలు చేయకపోతే గ్రామంలో 24 గంటలు పనిచేసే 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చేది.





చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్-2 శంకుస్థాపన స్థలంలో మొక్క నాటుతున్న చంద్రబాబు (ఫైల్ ఫొటో)

గోదావరి జలాల అనుసంధానం

చాట్రాయి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2కి 2017 సెప్టెంబరు 17న ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సమీపంలో మొద్దులపర్వ వద్ద అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రాష్ట విభజన నేపథ్యంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని జోన్-2,3 కి సాగునీరు వచ్చే అవకాశాలు సన్నగిల్లడంతో అప్పటి మైలవరం ఎమ్మెల్యే, జనవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్-1 కి 2008లో అప్పటి సీఎం వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. ఫేజ్-1 కాలువ చింతలపూడి మండలం యర్రగుంటపల్లి వద్ద ముగుస్తుంది. అక్కడ నుంచి చాట్రాయి మండలం మీదుగా 14 కిలో మీటర్లు కాలువ తవ్వి, చాట్రాయి వద్ద నాగార్జున సాగర్ వేంపాడు మేజర్ కాలువకు లింక్ చేయటానికి, అక్కడ నుంచి వేంపాడు మేజర్ కాలువను 9 మీటర్లు వెడల్పు నుంచి 19 మీటర్లుకు విస్తరించి విస్సన్నపేట మండలం రామచంద్రాపురం వద్ద నాగార్జున సాగర్ 117 హెడ్ రెగ్యులేటర్ దగ్గర గోదావరి జలాలను అనుసంధానం చెయ్యాలని డిజైన్ రూపొందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకానికి రూ 4,909 కోట్లు (1, 2 ఫేజ్‌లకు కలిపి) నిధులు మంజూరు చేసి పనులను పరుగులెత్తించారు. ఫేజ్-2లో సుమారు 60 శాతం, ఫేజ్-1లో 50 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని మూలన పడేసింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు చింతలపూడి ఎత్తిపోతల పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన న్యాయపరమైన చిక్కుల వల్ల పనులు ప్రారంభించలేని పరిస్థితి. ఇటీవల నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ఆగిరిపల్లి మండలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు నుంచి వీలైనంత త్వరగా క్లియరెన్స్ తీసుకొని చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ పథకం ఉపయోగంలోకి వస్తే ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో 5 లక్షల ఎకరాల మెట్ట భూములు గోదావరి జలాలతో సస్యశ్యామలం అవుతాయి.

వెంకన్న క్షేత్రానికి నాలుగు లేన్ల రహదారి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకా తిరుమలకు ప్రయాణమంటేనే యాత్రికులు గతంలో భీతిల్లేవారు. గోతులతో అధ్వానంగా ఉన్న సింగిల్ రోడ్డుపై ప్రయాణించాలంటే హడలి పోయేవారు. ఈ రోడ్డును నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి చంద్రబాబు ప్రభుత్వానికి చేరింది. 2015లో పుష్కరాల సమయంలో అప్పడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ రహదారిని నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే కాకుండా రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసారు. దీంతో ఐదుగురు కాంట్రాక్టర్లు దాదాపు 17కి.మీ మేర రోడ్డు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు ఈ ఈ రహదారి ఎంతో సౌకర్యవంతమైంది.





ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నున్న తిరుమలరావు

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తిరుమల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ 2వర్యాంకు, కె.యశ్వంత్ సాత్విక్, 3వ ర్యాంకు, పి.శరత్ సంతోష్ 9వ ర్యాంకు, వి.తేజశ్రీ 18వ ర్యాంకు, టి.జశ్వంత్ దొర 30వ ర్యాంకు, కె.అభినవ్ 45వ ర్యాంకు, కె.యశ్వంత్ రాజా 46వ ర్యాంకు, జి.సంతోష్ రాజా 66వ ర్యాంకు, ఇ.వర్షిత్ 75వ ర్యాంకు, ఎం.కారుణ్యారాజ్ 86వ ర్యాంకు, కె.వెంకటరామ వినీష్ 100వ ర్యాంకు, జి.కార్తీక్ 120 ర్యాంకు, వి.రాయసాయి వరుణ్ 153వ ర్యాంకు, జి.చేతన్ నాగ అనిరుధ్ 154వ ర్యాంకు, కె.శంకర్ మాణిక్ 191వ ర్యాంకు, పి.జశ్వంత్ సాయి చరణ్ 219వ ర్యాంకు, ఎం.విశ్వనాథ నాగసాయిరామ్ 224వ ర్యాంకు, డి.ఆశిష్ సాయి శ్రీకర్ 235వ ర్యాంకు, కె.సాయి శృజన 236వ ర్యాంకు, సీహెచ్ శాయి చరణ్ 242వ ర్యాంకు, వై.దేవేష్ రుత్విక్ 246వ ర్యాంకు, పి.ప్రవీణ్ రుద్రేష్ 247వ ర్యాంకు, సాధించడంతో పాటు 292, 310, 313, 319, 326, 331, 338, 349, 366, 391, 395, 403, 429, 444, 465, 473 ర్యాంకుల సాధించారన్నారు. 1000 లోపు 58, 5000 లోపు 254, 10,000 లోపు 417, 20,000లోపు 654 మంది ర్యాంకులు సాధించా రన్నారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1620 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది 93 శాతం సక్సెస్ రేటు సాధించారన్నారు. ర్యాంకుల సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి అభినందించారు.

భీమవరం విద్యార్థుల ప్రతిభ

భీమవరం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ 2025 పరీక్ష ఫలితాల్లో భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఆల్ ఇండియాలో 276వ ర్యాంకు, పిజె హర్షవర్ధన్ (394), జి.నిఖిల వర్మ (633), ఎ.శివకార్తీక్ (804), బి.హరిరామ్ (845), కె.శివ (846), ఎన్.మణిదీప్ కుమార్ (1387), సురేంద్రకుమార్ (1567), జిసుబన్ (1653), ఎన్‌వీ మనోజ్ఞ (1754), సాయిచరణ్ (1973)ఉత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. అంతే కాకుండా ఆల్ ఇండియాలో 500 లోపు ఇద్దరు, వెయ్యిలోపు 45 మంది, 20 వేలలోపు 100 మంది ర్యాంకు సాధించారని వివరించారు. విద్యార్థులను డైరెక్టర్స్ ఎన్.సాయిరాజు, పి.శ్రీని వాసవర్మ, జి.సతీష్ బాబు అభినందించారు.



ఉత్తమ ప్రదర్శన 'ఇది అతని సంతకం' నాటికకు బహుమతి అందిస్తున్న సభ్యులు

ఉత్తమ ప్రదర్శనగా ఇది అతని సంతకం

ద్వితీయ బహుమతి అందుకున్న దేవరాగం

ముగిసిన కళారంజని జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కళారంజని జాతీయ స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీల్లో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇది అతని సంతకం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ముడు రోజుల పాటు భీమవరం సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కళారంజని జాతీయస్థాయి నాటిక పోటీల ఫలితాలను కళారంజని నాటక ఆకాడమి శనివారం తెలిపారు. సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటిక ద్వితీయ ప్రదర్శనగా నిలించింది.ఉత్తమ రచన కెకెఆర్ స్వామి, ఉత్తమ దర్శకత్వం ఎన్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటుడు సత్యమూర్తి పాత్రధారి రవీంద్రరెడ్డి (ఇది అతని సంతకం), ఉత్తమ నటి జ్యోతిరాణి (దేవరాగం), ఉత్తమ ప్రతి నాయకుడు మంజునాథ (హక్కు), ఉత్తమ హాస్యనటుడు వరప్రసాద్ (అనస్వరం), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ బీఎస్ఎస్ శివ (దేవరాగం) ఉత్తమ రంగాలంకరణ టి.బాబూరావు, (తితిక్ష) ఉత్తమ సంగీతం లీలా మోహన్ (ఇది అతని సంతకం)లకు అందించారు. పోటీలకు గుణనిర్ణేతలుగా గంటా రామ్మోహనరావు, ముత్యాలరావు నాయుడు, అల్లు రామకృష్ణ వ్యవహరించారు. కళారంజని అధ్యక్ష, కార్యదర్శులు నల్లవెంకట కృష్ణ నాగేశ్వరరావు, జవ్వాది దశరధి శ్రీనివాస్, ఎం.సీతారాం ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏడుకొండలవాని సన్నిధి శనివారం భక్త జనులతో కళకళలాడింది. ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు యాత్రికులతో సందడిగా మారాయి, వేలాది మంది యాత్రికులు క్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. తరువాత నిత్యాన్నదాన సదనంలో స్వామివారి ఉచిత అన్న ప్రసాదం స్వీకరించారు. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.





పట్టిసీమ మోడల్ హౌస్ పరిశీలిస్తున్న మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు

పోలవరం,పట్టిసీమ ప్రాజెక్టులను సందర్శించిన మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు

పోలవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకాలను శనివారం మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు సందర్శించారు. మహారాష్ట్ర జలవనరులశాఖ కార్యదర్శి సంజయ్ బెల్సారే, గోదావరి నది నిర్వహణ ఔరంగాబాద్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తీర్మన్వర్, జల వనరుల విభాగం పూణె చీఫ్ ఇంజనీర్ హనుమంత్ గుణాలే , నాసిక్ విభాగం చీఫ్ ఇంజనీర్ ఆశిష్‌ల బృందం పోలవరం ప్రాజెక్టుని, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించి సంబంధిత వివరాలను సీఈ నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం ప్రాజెక్టులో స్పిల్వే, స్పిల్వే గేట్లు, ఫిష్ లేడర్, ఎగువ దిగువ కాఫర్ డ్యాంలు డయాఫ్రంవాల్ ప్రాంతాలను, జల విద్యుత్ కేంద్రం నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి సంబంధిత వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ యంత్రాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఫిష్ ల్యాడర్ ప్రత్యేకతను ఏపి జలవనరులశాఖ అధికారులు వారికి వివరించారు. వరదల సమయాలలో వచ్చే పులస చేప ఎదురీతతో వస్తుందని ఫిష్ ల్యాడరు ద్వారా ఎగువకు ప్రయాణిస్తుందని వివరించారు. దేశంలో ఇలాంటి నిర్మాణం మరెక్కడా లేదని వారికి ఏపీ ఇంజనీర్లు వివరించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఫోర్‌బేలను బృందం పరిశీలించింది, సంబంధిత వివరాలను ఇంజనీర్లు వారికి వివరించారు. గోదావరి వరద సమయంలో నీటిని ఎలా పంపిణీ చేస్తారో మోడల్ హౌస్ చూపించి ఇంజనీర్లు వారికి వివరించారు. అనంతరం సీఈ వారికి శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు. ఈఈ శ్రీనివాస్, ఏఈఈలు పద్మకుమార్, అనీల్ కుమార్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీష్ బాబు, డీజీఎం మురళి పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోండి

» పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. పలు పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను అన్ని శాఖలు నిర్ణీత గడువులోపు అనుమతులను మంజూరు చేయాలని సూచించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేస్తామన్నారు. జిల్లాస్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపపై అవగాహన పెంపొందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని తెలిపారు. గత మార్చి 20వ తేదీ నుంచి ఇప్పటివరకు పలు శాఖల నుంచి అనుమతుల కోసం 52 దరఖాస్తులు అందగా 42 దరఖాస్తులను ఆమోదించామని, మరో పది దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్.వి.ఎస్.వి ప్రసాద్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘డ్రోన్ల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు’

భీమవరంటౌన్ : డ్రోన్ల కొనుగోలుకు రైతు గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, డ్రోన్ గ్రూపు సభ్యులు కన్వీనర్, కో-కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డ్రోన్ పైలట్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రూ.10 లక్షల రుణాన్ని అందజేస్తుందన్నారు. ఈనెల 30వ తేదీ లోపు గ్రూపులు కట్టాల్సిన రూ.ఐదు లక్షలు బ్యాంకులో జమ చేస్తే, మరో రూ.ఐదు లక్షలు బ్యాంకులు మంజూరు చేస్తాయన్నారు. మూడేళ్లలో నాలుగు శాతం వడ్డీతో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇన్‌స్టాల్మెంట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ కొనుగోలు సమయంలో ఒక ఏడాది ఇన్సూరెన్స్ రూ.30 వేలు చెల్లిస్తే రెండేళ్ల అదనపు వారంటీ ఉంటుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణం పరేడ్ గ్రౌండ్‌లో డ్రోన్ ఫ్లై చేయించి డ్రోన్ పనితీరును అన్ని గ్రూపుల వారితో కలిసి పరిశీలించారు.



కేపీపాలెం సాగర తీరానికి తరలివచ్చిన విశ్వాసులు

బీచ్‌కు తరలివచ్చిన విశ్వాసులు

మొగల్తూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కేపీపాలెం సాగరతీరంలో వున్న సాగరతార వేళాంకిణ్ణి మాత ఆలయానికి క్రైస్తవ విశ్వాసులు భారీగా తరలివచ్చారు. గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని 40 రోజులపాటు శ్రమకాల దీక్ష చేసిన విశ్వాసులు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు తరలివచ్చిన విశ్వాసులతో బీచ్ ప్రాంతం కిటకిటలాడింది. వీరు వేళాంకిణ్ణి మాతను దర్శించుకుని సముద్రస్నానం చేసిన దీక్షను విరమించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, తహసీల్దార్ రాజ్‌కిషోర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్‌లు వాసు, నాగలక్ష్మి, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టారు.

నవగ్రహాలను తాకిన సూర్యకిరణాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జుత్తిగలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న నవగ్రహ ఆలయంలో సూర్యుడు, శుక్రుడు, బుధుడు, గురుడు, రాహువు గ్రహాలను శనివారం సూర్యకిరణాలు తాకాయి. పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శివకుమార్, సాయి గణేష్‌శర్మ, వాసుశర్మ ఆధ్వర్యంలో నవగ్రహాలకు విశేష అభిషేకం, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. శనైశ్చరుడుకి తైలాభిషేకం నిర్వహించారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

అట్టడుగు ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అట్టడుగు ప్రజల ఆర్థిక స్వావలంబన కోసం సంక్షేమ పథకాలను అమలుపర్చడంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాధికారిత సంక్షేమ పథకాలను అమలు పరిచే సంబంధిత అధికారులతో సదస్సును శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ మాట్లాడుతూ అట్టడుగు ప్రజల ఆర్థిక స్వావలంభన కోసం రాజ్యాంగం సంక్షేమ పథకాలను అమలు పర్చాలని సూచించిందన్నారు. దీనిలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందడంలో న్యాయసమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీనెంబర్ 15100 కాని ఏలూరులో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ ఫోన్ నెంబర్ 08812 22455కు సమాచారం అందించాలన్నారు. ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన అభ్యర్థుల వివరాలు సేకరించి వారికి అవసరమైన సంక్షేమ పథకాలను ఇవ్వడం జరుగుతుందాన్నారు. భీమవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్తున్నామని అన్నారు.

సోషల్ మీడియాలో డిప్యూటీ సీఎంను కించపరిచే పోస్టులు

యువకుడి అరెస్టు

భీమవరం క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మార్ఫింగ్ ఫొటోల ద్వారా సోషల్ మీడియా వేదికగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. రాజకీయ, కుల, మత వర్గ, జాతి, ప్రాంతీయ విభేదాలు సృష్టించే విధంగా సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం సేటేరి గ్రామానికి చెందిన చింతలపూడి పవన్‌కుమార్ (ప్రేమ్) అనే యువకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్ చేయడమే కాకుండా వారి గౌరవానికి భంగం కలిగించే విధంగా, అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా అతను ట్విట్టర్ ద్వారా పోస్టులు పెట్టాడు. దీనిపై చర్యలు తీసుకోవాలని శనివారం భీమవరం పట్టణానికి చెందిన పత్తి హరివర్ధన్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్ ఇవ్వడం జరిగిందన్నారు.

తడి, పొడి చెత్తను ఇంటి నుంచే వేరుచేయాలి

» తాడేపల్లిగూడెం ‘స్వచ్ఛాంధ్ర’లో పశ్చిమ జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్/కాళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను ఇంటి నుంచే వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి సూచించారు. ‘స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం పట్టణం నాలుగో వార్డులోని అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ-వేస్ట్ అవగాహన, 14వ వార్డు బీఆర్ మార్కెట్‌లో తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చే ప్రక్రియ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నియంత్రణ, నిర్మూలనతో మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ మూడో శనివారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు. ఏమైనా పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటే వాటిని పట్టణ మునిసిపల్ కేంద్రాలలో, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలలో అందజేయాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బీఆర్ మార్కెట్‌లో కంపోస్ట్ యూనిట్‌ను వారు సంయుక్తంగా ప్రారంభించారు. మునిసిపల్ కమిషనర్ ఏసుదాసు, తహసీల్దార్ సునీల్‌కుమార్, గొర్రెల శ్రీధర్, వర్తనపల్లి కాశి, పుల్లా బాబ్జి, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద అమిరంలో..

కాళ్ల మండలం పెదఅమిరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మానవాళికి ఎంతో నష్టం చేకూర్చే ఈ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇస్తున్నారా ?.. ఆ చెత్తను ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొంతమంది గృహస్థులు వేరుచేసి ఇవ్వడం లేదని, చెత్తను సంపద కేంద్రానికి తరలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు, స్థానిక ప్రజలు అందజేసిన ఈ- వేస్ట్‌ను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డీపీవో బి.అరుణశ్రీ, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ప్రజల నుంచి పాడైన ఎలక్ట్రికల్ వస్తువులను సేకరిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం : ఎస్పీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏపీని పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దుదామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో కలిసి స్వయంగా చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. గునపం, పార చేతబట్టి పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచడం వల్ల చాలావరకు అనారోగ్యాలను మన దరిచేరకుండా చేసుకోవచ్చన్నారు. వాతావరణ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, గుడ్డ సంచులు వాడాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



‘స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమంలో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

పాలకోడేరులో ఉద్రిక్తం

» కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపులో తోపులాట

» కుప్పకూలిన 9 మంది మహిళలు.. ఆసుపత్రికి తరలింపు

పాలకోడేరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పాలకోడేరు శివారు రాశి కాలువ గట్టుపై ఆక్రమణల తొలగింపులో తోపులాట.. ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలివి.. కాలువ గట్టుపై గత 40 ఏళ్లుగా సుమారు 110 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. వీరు నివసిస్తున్న ప్రాంతం పంట కాలువను చేర్చి ఉండడంతో కాలువలు పాడవుతున్నాయని, ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం సుమారు 48 గృహాలను తొలగించేందుకు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖాధికారులు ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించేందుకు సన్నద్ధమయ్యారు. స్థానికులు సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో అధికారులు కాలనీ లోపలికి ప్రవేశించకుండా రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ క్రమంలో పోలీసులు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు జక్కంశెట్టి సత్యనారాయణను అదుపులోకి తీసుకుని జీపులో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులు, స్థానికుల మధ్య అరగంటపాటు తోపులాట జరిగింది. ఈ తోపులాటలో తొమ్మిది మంది మహిళలు కుప్పకూలడంతో పాలకోడేరు పీహెచ్‌సీ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి 108 సాయంతో పాలకోడేరు పీహెచ్‌సీకి తరలించారు. ఆ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కొంతసేపు ఆపడంతో పరిస్థితి కాస్త చక్కబడింది. సాయంత్రం పోలీసులు సీపీఎం నాయకులు జేఎన్‌వీ గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణతో సంప్రదింపులు జరిపి ఐదు గృహాలను పడగొడతామని, సహకరించాలని చెప్పడంతో స్థానికులు అంగీకరించడంతో పోలీసుల ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు ఐదు గృహాలను పడగొట్టించారు. ఈవిధంగా శనివారం ఉదయం ఉద్రిక్తంగా మారిన ఈ ఆక్రమణల వివాదం సాయంత్రానికి సద్దుమణిగింది.



పాలకోడేరులో పోలీసు వాహనాన్ని అడ్డుకుంటున్న స్థానికులు

పేదల ఇళ్లు తొలగించడం దారుణం

కాళ్ల/ఆకివీడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లు తొలగించడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. పాలకోడేరులో పోలీసుల నిర్బంధంలో పేదల్ని, సీపీఎం నాయకుల్ని ఉంచి యంత్రాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇళ్లను తొలగించడంపై శనివారం బొండాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు.

- ఆకివీడు గాంధీజీ సెంటర్‌లో సీపీఎం శ్రేణులు ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటి నాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో పేద ప్రజలపై ఎమ్మెల్యే, అధికార యంత్రాంగం విరుచుకుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలపై ప్రభుత్వం ధమనకాండను వెంటనే నిలిపివేయాలంటూ నిరసన తెలిపారు. ఆకివీడులో హైవేని ఆక్రమించుకుని అనేక రూ.కోట్లు సంపాదించుకుంటున్న పెద్దవారిని వదిలేసి బక్క జీవులపై ప్రతాపం చూపిస్తున్నారని విమర్శించారు. పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, రవితేజ, బీవీ వర్మసు బ్బారావు, నెల్లి సూరిబాబు, ఎస్.సత్యనారాయణ, ప్రవీణ్, రమణ, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరా అందజేత

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉన్న డ్రోన్ కెమెరాలను పోలీస్ శాఖకు అందించడం ఎంతో అభినందనీయమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ 8 లక్షల రూపాయల విలువైన అధునాతన డ్రోన్‌ను పోలీస్‌శాఖకు అందించారు. ఈ డ్రోన్‌ను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో నేరస్తులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉద్యోగ నిర్వహణ చేస్తున్నారని అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ మాట్లాడుతూ సమాజ భద్రత, ప్రజల రక్షణలో పోలీస్ విభాగం నూతన ఒరవడిలో పయనిస్తుందన్నారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్, కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్, ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రకుమార్‌ను సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం రఘులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు.



డ్రోన్ కెమెరా దాతను సన్మానిస్తున్న ఐజీ, ఎస్పీ

డివైడర్‌ను ఢీకొని విద్యార్థి మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గాయపడిన విద్యార్థి మృతి చెందినట్లు భీమవరం టూటౌన్ ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న రాజమహేంద్రవరానికి చెందిన ఎం.జ్ఞానసాగర్ (21) శుక్రవారం రాత్రి తన స్నేహితుడు కె.సాయిభరత్‌తో కలిసి గరగపర్రు రోడ్డులోని తన రూమ్ నుంచి మోటార్ సైకిల్‌పై పట్టణంలోనికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న జ్ఞానసాగర్ తలకు తీవ్రంగాను, సాయి భరత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే వైద్యం కోసం ఆసుపత్రికి తరలించగా జ్ఞానసాగర్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. సాయిభరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపారు.



గంజాయి కలిగి ఉన్న 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో 11 మంది అరెస్టు

ఉండి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉండిలోని డంపింగ్ యార్డు దాటుకుని ఉప్పుగుంట వద్ద శుక్రవారం సాయంత్రం గంజాయితో వున్న 11మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1650గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11 మందిలో వివిధ ప్రాంతాలకు చెందిన ములపర్తి అజయ్‌కిరణ్, గంధం వంశీ, తోట శివకుమార్, వీరవల్లి దశరథ్ కుమార్, బళ్లారి కీర్తిరాజు, సవరపు నారాయణ, దాసి విజయ్, కప్పల జేమ్స్, మాగబత్తుల భరత్, పీతల జాన్‌రాజు, పోతురాజు ఆనంద్‌లను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జయసూర్య తెలిపారు. ఎస్ఐ నజీరుల్లా ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువకుడు క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని తూర్పువీధికి చెందిన దుర్గాసి దుర్గారావు (34) రెండేళ్ళ క్రితం మాధవి అనే యువతితో వివాహమైంది. వీరికి సంతానం లేదు. వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 18వ తేదీ రాత్రి మద్యం తాగి వచ్చిన దుర్గారావు మాధవీతో గొడవపడి గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఈ సమాచారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అందడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ మదీనాబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని శనివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన మహంతి గాంధీ (66) పెదవేగి మండలం వేగివాడలో సామిల్లు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి సామిల్లు నుంచి తిరిగి ఏలూరుకు మోటారు సైకిల్ పై వస్తుండగా గోపన్నపాలెం అంజనేయస్వామి గుడి వద్ద ఒక ఆటో ఢీకొని వెళ్ళిపోయింది. మరో ఆటోలో అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కేన్సర్ రోగి ఆత్మహత్య

ఆచంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆచంట శివారు బాలంవారిపాలెంకు చెందిన వేండ్ర శ్రీను (49) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. మృతుడు శ్రీను కేన్సర్ వ్యాధితో బాధపడుతుండగా అతనితోపాటు కూతు రు కూడా మానసిక వ్యాధితో బాధపడుతున్నది. ఈ విషయంపై మృతుడు మనస్థాపం చెందుతున్నాడు. శనివారం ఉదయం కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ఆస్పత్రికి, మరలా అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. వెంకట రమణ తెలిపారు.

బీచ్‌లో స్నానానికి దిగిన యువకుడి మృతి

మరో యువకుడికి తప్పిన ప్రమాదం

మొగల్తూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌కు గుడ్‌ఫ్రైడే సందర్భంగా దీక్ష విరమణకు వచ్చిన క్రైస్తవ విశ్వాసులకు ఈ ఏడాది అపశ్రుతి చోటుచేసుకున్నది. ప్రతి ఏటా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా విశ్వాసులు 40 రోజుల పాటు దీక్ష చేసి గుడ్‌ఫ్రైడే రాత్రి సమయంలో పేరుపాలెం తీరంలోని వేళాంకిణ్ణి మాత ఆలయం వద్ద దీక్ష విరమణ చేయడం క్రైస్తవ విశ్వాసుల ఆనవాయితీ. ఈ ఏడాది శుక్రవారం రాత్రి వచ్చిన సందర్శకుల్లో శనివారం వేకువజామున సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులు ఎక్కువ సముద్రం నీరు తాగడంతో ఉక్కిరిబిక్కిరికిలోనై ఒడ్డుకు ప్రాణాలతో కొట్టుకువచ్చారు. వీరిలో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశ్‌పాలెంకు చెందిన సంకెళ్ళ ఉదయ్‌కుమార్(19) అనే యువకుడిని స్థానికులు, పోలీస్ సిబ్బంది మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరోవ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో భీమవరంలో కుటుంబ సభ్యులు వైద్యం చేయించుకుని సురక్షితంగా ఇంటికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఆ వ్యక్తి వివరాలు తెలియలేదు. మృతి చెందిన ఉదయ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా తల్లి విజయలక్ష్మి ఆలనాపాలన చూస్తోంది. ఈ ఘటనపై మృతుడి అక్క విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు మొగల్తూరు 2వ ఎస్ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన సంకెళ్ళ ఉదయ్ కుమార్

హిందువులపై మారణకాండను ఆపాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్లో హిందువులపై మారణకాండను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీహెచ్‌ఎస్ నాయకులు గెడ్డం నాగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ చక్రధర్, రాజనాల రామచంద్రరావు మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. హిందువులను అత్యంత దారుణంగా హింసకు గురి చేయడాన్ని ఆయన ఖండించారు.

ఈ- వేస్ట్ గురించి విద్యార్థుల అవగాహన ర్యాలీ

పెదపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : వట్లూరు సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు భోగాపురంలో ఈ-వేస్ట్ మీద శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. పాత ఫోన్లు, పాడైన కంప్యూటర్లు, టీవీలు, బ్యాటరీలు, రిమోట్లు వంటి పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను బయట వేయవద్దని ప్రజలకు సూచించారు. వీటిని రీసైక్లింగ్ కేంద్రాలకు ఇవ్వాలని, లేకపోతే గ్రామంలో ఏర్పాటు చేసిన కలెక్షన్ బాక్స్‌లో వేయవచ్చని ప్రిన్సిపాల్ సరళ తెలిపారు.

టీడీపీ నూతన సభ్యత్వ కార్డుల పంపిణీ


సభ్యత్వ కార్డులు అందజేస్తున్న దృశ్యం

టి.నర్సాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : రాజుపోతేపల్లి గ్రామంలో సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ జావులూరి సూర్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి కనకయ్య ఆధ్వర్యంలో టీడీపీ నూతన సభ్యత్వ కార్డులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడు తూ సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల బీమా వర్తి స్తుందని, ఈ మేరకు నూతన కార్డులను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్య క్రమంలో నాయకులు ముసులూరి బాలస్వామి, కొల్లి బుజ్జి, చిలకా బాలయ్య, తాడేపల్లి బాలస్వామి, చిలకా వెంకటేశ్వరరావు, అందుగుల గాంధీ, నాగరాజు, ఏసు, జాన్‌రాజు, చిలకా సుబ్బు, రంగబాబు, ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను పోర్టల్లో నమోదు చేయండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య కేంద్రాల ద్వారా క్షేత్ర స్థాయిలో అందిస్తున్న అన్ని వైద్య సేవల సమాచారాన్ని హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్లో నమోదు చేయాలని శిక్షణాధికారి డాక్టరు కె.మురళీధర్ తెలిపారు. శనివారం కె.ఆర్.పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆరోగ్య సేవల నమోదుపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి శిక్షణనిచ్చారు. ట్రైనర్స్ ఎల్.సుబ్రహ్మణ్యం, వైనరేశ్ బాబు ఆరోగ్య సేవలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేశ్ కుమార్, కె.ఆర్.పురం, అంతర్వేదిగూడెం, దొరమామిడి పీహెచ్‌సీల వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

రాష్ట్ర శ్రేయస్సే చంద్రబాబు లక్ష్యం : అప్పలనాయుడు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శ్రేయస్సే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అలుపెరగకుండా పోరాడుతున్నారని విజయవాడ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నూతన పారిశ్రామిక విధానాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలని అప్పలనాయుడు ఆకాంక్షించారు.

టీచర్ల కేటాయింపులో సవరణలు చేయండి : డీటీఎఫ్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటు చేయతలపెట్టిన ఐదురకాల బడులకు ఉపాధ్యాయుల కేటాయింపు సహేతుకంగా లేదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి ఆరోపించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్‌కు లేఖ పంపినట్టు శనివారం తెలిపారు. ప్రైమరీ పాఠశాలలకు ఉపాధ్యాయుడు/విద్యార్థుల నిష్పత్తిని 1:20గా మార్చాలని, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ఆ స్కూళ్లకు కేటాయించొద్దని కోరారు. ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు ఏర్పాటు చేస్తున్న పాఠశాలలను రెండు లేదా ఒక పాఠశాలగా పరిగణించడంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల బ్రోచర్ విడుదల

ఉంగుటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల బ్రోచర్‌ను శనివారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. నాక్‌లో బి-ప్లస్ గ్రేడ్ రావడంతో అధ్యాపకులకు బాధ్యత పెరిగిందని, నూతనంగా నిర్మిస్తున్న భవనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో డా.కొండా రవి, జి.రామ్మోహన్, ఐ.లావణ్య, టి.గాబ్రియేలు కరపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి

చింతలపూడి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి త్వరగా ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్టకు గోదావరి జలాలు మళ్లించాలనే తలంపుతో చేపట్టిన ప్రాజెక్టు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కావడంలేదన్నారు. అలాగే మండలాల్లో చెరువులను బాగు చేసి నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.బాబు, ఎం.వసంతరావు, డి.కృష్ణ, ఎస్.కె.కాలేషా పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి నివారణపై అవగాహన

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో సికిల్ సెల్ వ్యాధిని తరిమికొట్టాలన్న నినాదంతో డిజిటల్ స్క్రీన్స్ ద్వారా ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్నట్టు కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. ఈ మేరకు డిజిటల్ స్క్రీన్ ఉన్న వాహనాన్ని శనివారం ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల్లో తల్లిదండ్రుల నుంచి జన్యుపరంగా సికిల్(కొడవలి) సంక్రమిస్తోందని, ఎర్ర రక్త కణాలు బలహీనంగా మారి రక్తహీనతను కలిగిస్తాయన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రతి పీహెచ్‌సీ పరిధిలోని ఐదు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకోవడానికి రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి తెలిపారు. జిల్లాలో 1,111మంది లబ్ధిదారులకు 46.44కోట్లు రుణాలిచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. 25.77 కోట్లు సబ్సిడీ మంజూరైందన్నారు. అర్హులు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడు కేటగిరిలుగా విభజించి రూ.3 - 10లక్షల లోపు రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్‌లో సంప్రదించాలన్నారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 50సంవత్సరాల మధ్య ఉండాలన్నారు.

హర్షిత పాఠశాల గుర్తింపు రద్దు

కామవరపుకోట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని కళ్లచెరువు రోడ్డులోని హర్షిత పాఠశాల గుర్తింపును జిల్లా విద్యాశాఖ రద్దు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు తెలుసుకోవాలని ముందస్తుగానే తమ పిల్లలను ప్రత్యామ్నాయం చూసుకోవాలని తెలియజేశారు.

గౌతు లచ్చన్నకు భారత రత్న ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : సర్దార్ గౌతు లచ్చన్నకు భారత రత్న ప్రకటించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు కేంద్రాన్ని కోరారు. శనివారం మండలంలోని లక్కవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్యామ్ చంద్రశేషు గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో గౌతు లచ్చన్న అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కె.మాధవరావు, ముళ్ళపూడి శ్రీను, కొరారు ప్రసాద్, గద్దే బాబీ, వందనపు రమణ, నాగిరెడ్డి, దుర్గారెడ్డి, బజారు పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సర్

(ఏడో పేజీ తరువాయి)

చేయడం విశేషం. ఏలూరు రూరల్‌మండలం శనివారపుపేటలో ప్రభుత్వ బాలుర వసతి గృహం పాఠశాలకు 6 ఎస్జీటీ, ఒక వ్యాయామోపాధ్యాయుడు పోస్టులను భర్తీచేయడానికి నిర్ణయించారు. తొలుత ఉమ్మడిజిల్లాకు ప్రకటించిన 1035 పోస్టులకు ఇవి అదనం. ఈ పోస్టులతో కలిపితే మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి భర్తీఅయ్యే ఉపాధ్యాయ పోస్టులసంఖ్య 1042కి పెరుగుతుంది. రాష్ట్రంలో ఏలూరు, విశాఖపట్నం, కడపలలో మాత్రమే జువనైల్ హోం పాఠశాలలున్నాయి. ఇవి పోలీసు, మహిళా శిశు సంక్షేమ సంస్థలకు అనుబంధంగా ఏర్పాటు కాగా, పాఠశాలలకు బోధనాసిబ్బందిని మాత్రం విద్యాశాఖ నియమిస్తుంది.

మూడు జిల్లాల పరిధిలో జోనల్ ఉపాధ్యాయ పోస్టులు 348

జోన్-2 జిల్లాలైన ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్/ ఏపీ సోషల్ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/గిరిజన గురుకుల పాఠశాలల్లో బోధనకు ప్రత్యేకంగా 49 పీజీటీ, 272 టీజీటీ, 3 పీడీ, 24 పీఈటీ పోస్టులు కలిపి మొత్తం 348 టీచరు నియామకాలను నోటిఫికేషన్‌లో చేర్చారు. ఈ పోస్టుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ఎన్ని లభిస్తాయో సంబంధిత శాఖల హెచ్‌వోడీలు ప్రకటించాల్సి ఉంది. జోనల్ పోస్టులుగా వీటిని పరిగణిస్తున్నందున ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు మూడు జిల్లాల పరిధిలో ఎక్కడైనా నియమితులయ్యే అవకాశం ఉంటుంది.

నగరంలో తాండవిస్తున్న అపారిశుధ్యం

నాలుగు నెలలుగా రోడ్లపైనే సిల్ట్ - పెరిగిన దోమల బెడద - రక్తం తాగేస్తున్నాయంటూ బెంబేలు

ఏలూరు కార్పొరేషన్,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా నగర పాలక సంస్థ స్పందించడం లేదనే విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. అపరిశుభ్రత కారణంగా దోమల బెడద రోజురోజుకీ పెరుగుతోందని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు, తమ్మిలేరు కాలువలు, మురుగు కాలవలు ఇళ్ల మధ్యే ఉండడంతో దోమల బెడద మరింత పెరిగింది. ఇటీవల బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ ఆలయం నుంచి స్మశాన వాటిక వరకు ఉన్న మురుగు కాలువలో పూడిక తీసి ఆ సిల్ట్‌ను రోడ్డుపై అలాగే వదిలేశారు. దాదాపు నాలుగు నెలలైనా వాటిని తొలగించలేదంటూ నగర వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువల నుంచి తొలగించిన శిల్ట్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వెంకటాపురం పంచాయతీలో డ్రెయినేజీల్లో పూడికలు తీసి వ్యర్థాలు, ప్లాస్టిక్స్ తొలగించి రోడ్డుపై పడవేస్తున్నారే గాని వాటిని తరలించడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నవాబుపేటలోని మురుగు కాలువ వద్ద పేరుకున్న చెత్త


సోమవరప్పాడు ర్యాలీలో పాల్గొన్న చింతమనేని


పోలవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు


చింతలపూడి స్వచ్ఛాంధ్ర ర్యాలీలో అధికారులు

గ్రామాలను శుభ్రంగా ఉంచండి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీల్లో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఇరిగేషన్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

● దెందులూరు/పెదవేగి :గ్రామాల శుభ్రతకు అంతా కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడులో నియోజకవర్గ స్థాయి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. పెదవేగి మండలం నాగన్నగూడెం, ముండూరు, చక్రాయగూడెం, వేగివాడ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రభాకర్ పరిశుభ్రతా కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు.

● పోలవరం: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.మండలంలోని గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, ఎల్లండీపేట, చేగొండపల్లి, వింజరం, ఇటుకలకోట, జిల్లెళ్లగూడెం, ఎల్లండీపేట గ్రామాల్లో నిర్వహించారు. పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ పొడుం పుష్ప, జనసేన నాయకులు కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

●ఉంగుటూరు: కాగుపాడులో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పొట్ట ఏడుకొండలు, మాజీ సర్పంచ్ కడియాల రవిశంకర్, సూరత్తుల అయ్యప్ప, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, టీడీపీ మండలాధ్యక్షులు పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

●టి.నర్సాపురం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.మణికుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మండల వైద్యాధికారి ఫణీంద్ర బాబు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన ర్యాలీల్లో పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొదుగు సునంద, పీఆర్ఏఈ సంపత్‌కుమారి పాల్గొన్నారు.

●లింగపాలెం : మండల విస్తరణాధికారి జేఎం రత్న కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను బయట వేయకుండా రీ సైక్లింగ్‌కు ఇవ్వాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆర్.పాపయ్య, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

●చింతలపూడి : నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కూటమి నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, టి.అప్పారావు, అనీష్ కుమార్, తోట నారాయణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

'శుభ్రమైన వాతావరణం ఉండాలి'

ఏలూరు క్రైం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యంగా జీవించగలుగుతామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఉదయం న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, న్యాయవాద గుమస్తాలు కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.కె.బులికృష్ణ, కృష్ణ సాయి తేజ, అబ్బుతాలిబ్ పర్వేజ్, రఘునాథ్, స్పందన, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అబ్బినేని విజయ్ కుమార్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు బివి కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అధ్యక్షులు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్, గవర్నమెంట్ ప్లీడర్ బిజె రెడ్డి, సీనియర్ న్యాయవాది కె.రామకృష్ణారావు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న శ్రీదేవి

యువకుడికి రిమాండు

ఉంగుటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించడంతో ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ విధించినట్టు ఎస్.ఐ. సూర్య భగవాన్ తెలిపారు. ఈ నెల 17న యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పొట్ల పండుబాబు అనే యువకుడిని శనివారం అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చారు. దీంతో సదరు యువకుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్.ఐ. తెలిపారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్

పెదవేగి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) :వంగూరు శివారు లక్ష్మీపురంలో సీఎస్ఐ దేవాలయ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ కృపావరం ఆధ్వర్యంలో శనివారం విశ్వాసులు ప్లకార్డులు ధరించి, వంగూరు, లక్ష్మీపురం, కవ్వగుంట గ్రామాల్లో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

● లింగపాలెం : క్రీస్తు బోధనలు ఆచరణీయమని, ప్రజలంతా క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడవాలని పాస్టర్ కమలాకర్ అన్నారు. శనివారం లింగపాలెంలోని మన్నావర్స్, ఆరాధనా టీవీ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల రక్షణ కోసం శిలువ ఎక్కిన క్రీస్తు త్యాగాలను మరువకూడదన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో క్రైస్తవ సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

● ఏలూరుటూటౌన్ : రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా పాతబస్టాండ్ నుంచి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఐసీఎం అగ్రపీఠాధిపతులు బిషప్ జాన్‌ఎస్‌డీ రాజు, మన్నాచర్చ్ బిషప్ ఎం.ఎలిషా రాజు, బురదగుంట క్రాంతి, రెవరెండ్ బీరపోగు యో హాన్, రెవరెండ్ బీవీ.రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం

పెదవేగి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏపీ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ సహాయ కార్యదర్శి ఏఎంవో నేముల సంజీవరావు ఆధ్వర్యంలో విద్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏఎంవో సంజీవరావు మాట్లాడుతూ సమాజం ఉన్నతికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారిణి ఉమాకుమారి, జంగారెడ్డిగూడెం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ భారతి, శ్రీనివాసరావు, వీడీ కె.జయరాజు, ఆచారి, సత్యమూర్తి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రామాలయానికి పాదయాత్ర

కుక్కునూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కొండపల్లి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భద్రాచలం రామాలయానికి శనివారం పాదయాత్రగా బయల్దేరారు. ఈ పాదయాత్రలో టీడీపీ నాయకులు ఉదయ్, సందీప్, కరేటి అప్పారావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా అన్నప్రసాద వితరణ

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : బావిశెట్టివారిపేటలోని శ్రీకోదండ రామాలయం వద్ద శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం మహా అన్నసమారాధనను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఏలూరు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన మామిళ్ళపల్లి పార్థసారధి ప్రారంభించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

స్వచ్ఛాంధ్రకు ప్రజలు కలిసిరావాలి : ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా 15వ డివిజన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఉపయోగపడని ఎలక్ట్రానిక్ పరికరాలు కార్పొరేషన్ సిబ్బందికి అందజేయాలన్నారు. వాటిని రిసైక్లింగ్ చేయడం వల్ల కొంత వరకు పర్యావరణానికి నష్టం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, కూనా మాణిక్యం పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

పెదపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు అభయాంజనేయ స్వామి హనుమజ్జయంతిని పురస్కరించుకుని మే 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఛైర్మన్‌గా నియమితులైన వేమూరి శ్రీనివాసరావు తెలిపారు.ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు, దేవాలయ అర్చకులు, ఇతర కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ పనుల ప్రారంభ సూచిక రాటను పాతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డి వాసవి, మట్టా శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, పావులూరి రామారావు, సగ్గుర్తి శ్రీనివాసరావ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చే దిశగా ప్రధాని మోదీ పాలన సాగుతుందని బీజేపీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణ అన్నారు. అంబికా ఫైటర్స్‌లో శనివారం అంబేద్కర్ జయంతిని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిశక్షర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, రాష్ట్ర నాయకులు ఉన్నమట్ల కపర్ది, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, శరణాల మాలతీరాణి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిని కలిసిన అంజుమన్ కమిటీ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏర్పడిన అంజుమన్ నూతన కమిటీ సభ్యులు శనివారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత కమిటీపై అవినీతి ఆరోపణలు రావడంతో అధ్యక్షుడిని తొలగించారు. నూతన అధ్యక్షుడిగా షేక్ జబీవుల్లా, కార్యదర్శిగా అహ్మదుల్లా షరీఫ్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాజా అహ్మద్, సిరాజ్ బాషా, రియాజ్ బాషా, ఎండీ ఇక్బాల్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీకి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక

చింతలపూడి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షులుగా తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ మాజీ కన్వీనర్ జె.ముత్తా రెడ్డి నియామక పత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగడవరం మేజర్ పంచాయతీలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.


అసత్య ఆరోపణలు సరికాదు

లింగపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడుతున్నారంటూ టీడీపీ మండలాధ్యక్షుడు, ఇతర నాయకులపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని నాయకులు పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈకార్యక్రమంలో చెరువుగట్టు రామ్మోహన్ రావు, పల్లి శ్రీను, తాడేపల్లి దానుబాబు, మోరంపూడి వరప్రసాద్, గజ్జా వెంకటేశ్వరరావు, గారపాటి సాయి, వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఈవో చందనకు బంగారం అందజేస్తున్న దాతలు

మద్ది ఆంజనేయునికి బంగారం వితరణ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామికి వేద పండితులు, అర్చకులు పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. టీడీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు కుటుంబం తరఫున ఏడు గ్రాముల 296 మిల్లీ గ్రాముల బంగారాన్ని ఈవో ఆర్.వి.చందన చేతుల మీదుగా స్వామికి సమర్పించారు. వివిధ సేవల రూపంలో స్వామికి రూ.1,02,230 ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని

కాగుపాడులో సీసీ రోడ్డు ప్రారంభం

ఉంగుటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. శనివారం కాగుపాడులో ఉపాధి హామీ నిధులు రూ.23 లక్షల 50వేలతో నిర్మించిన సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాళ్ల షెడ్డు ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాగుపాడు ఇన్‌చార్జి సర్పంచ్ పొట్ట ఏడుకొండలు, కడియాల రవిశంకర్ పాల్గొన్నారు. అనంతరం నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో ఇళ్ల నిర్మాణం నిమిత్తం 13 మంది లబ్ధిదారులకు స్థలాలను చూపించి ఎమ్మెల్యే ధర్మరాజు పట్టాలు అందించారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

ఉంగుటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : గోపీనాథపట్నంలో శనివారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులు తొలుత శాంతి పూజలను నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహో త్సవంలో 23న విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

ఇంటర్వ్యూ

పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలందిస్తాం

కె.విజయకుమార్, పశు వైద్యాధికారి, బుట్టాయగూడెం



● రైతులకు ఇవ్వడానికి పశుగ్రాసం విత్తనాలు ఎన్ని వచ్చాయి?

మండలంలో పాడి రైతులు 3 వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ ఇవ్వడానికి రెండు టన్నుల పశుగ్రాసం విత్తనాలు వచ్చాయి. రైతుకు 20 కేజీల చొప్పున ఇస్తాం.

● పశువులు, జీవాలకు టీకాలు?

మండలంలో 17 వేల వరకు పశువులు ఉన్నాయి. వీటికి గ్యాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశాం. అలాగే జీవాలు 14 వేల వరకు ఉన్నాయి. జీవాలకు చిటిక రోగం వచ్చే అవకాశం ఉన్నందున ఇ.టి. మందును వేస్తున్నాం.

● వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలేంటి?

వేసవిలో పశువులను కాపాడుకోవడానికి పశువులకు నీరు, నీడను అందుబాటులో ఉంచాలి. తమకున్న స్థలంలో నీడనిచ్చే వేపచెట్లను పెంచుకోవడం మంచిది.

● రైతులకు ప్రభుత్వం అందించే సహకారం ఏమిటి?

పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్నాం. అలాగే మండలంలో ఉపాధి నిధులు 2 లక్షలతో 20 గోకులాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

- బుట్టాయగూడెం

మాజీ సర్పంచ్ గంగరాజు మృతి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు,పులిరాముడుగూడెం మాజీ సర్పంచ్ కుంజా గంగరాజు(70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సుమారు 30 ఏళ్ల పాటు పి.ఆర్.గూడెం సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన భార్య కుంజా కన్నమ్మ కూడా సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు ముగ్గురు సంతానం ఉన్నారు. పలువురు నాయకులు ఆయన కుటుం బానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

'ప్రొటోకాల్ పాటించలేదు'

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధుల్ని ఆహ్వానించకపోవడం సరికాదని, ప్రొటోకాల్ పాటించరా అంటూ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానీలు అసహనం వ్యక్తం చేశారు. 19న ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులను పిలవకపోవడం కనీసం సమాచారం ఇవ్వకపోవడం మంచిది కాదని, విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

నేడు చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

కామవరపుకోట/కొయ్యలగూడెం, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకు కామవరపుకోట, కొయ్యలగూడెం మండలాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ తడికలపూడిలోని గంగానమ్మ ఆలయం నుంచి కామవరపుకోట వరకు చేపట్టే ర్యాలీకి మంత్రి కొలుసు పార్థసారథి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌లు పాల్గొంటారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ తన నివాసం వద్ద విందును ఏర్పాటు చేశారని సత్యనారాయణ తెలియజేశారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగే సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల సమయంలో స్ఫూర్తితో ప్రమాదం నుంచి రక్షించుకోవాలని అగ్ని మాపక సిబ్బంది ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని, రోగులను తక్షణమే వార్డుల నుంచి వెలుపలికి తీసుకురావాలని సూచించారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా దారం సత్తిరాజు



కొయ్యలగూడెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా దారం సత్తిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ నుంచి నియామక ఉత్తర్వులు వచ్చినట్టు ఆయన తె లిపారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లా డుతూ మండలంలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతా నికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలి పారు. ఆయన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఆగిరిపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి గ్రామంలో బి.జగన్నాథం కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం అందజేశారు. ఈ నెల 11వ తేదీన జరిగిన పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కులవృత్తిదారులను కలిసిన నేపథ్యంలో నాయీ బ్రాహ్మణుడైన బత్తుల జగన్నాథం భార్య అనారోగ్యరీత్యా సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చౌటపల్లి విజయలక్ష్మి, చౌటపల్లి విక్టర్‌బాబు, ఏపీఓ మీనాక్షి, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలువలకు నీరు విడుదల

కైకలూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మంచినీటి ఎద్దడి నివారణకై శనివారం కాలువలకు నీటిని విడుదల చేశారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్మికులు యుద్ధప్రాతిపాదికన తొలగిస్తున్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క, చెత్తాచెదారాన్ని తీసివేస్తున్నారు. సుమారుగా 50మంది కార్మికులు శనివారం ఉదయం నుంచి పనిచేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాకు 1,213 పోస్టులు

(తొమ్మిదవ పేజీ తరువాయి)

ఇవ్వటంపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అభ్యర్థులకు అనుకూలంగానే ఆదేశాలిచ్చింది. కాగా, ఎన్నికల్లో కూటమి పార్టీలు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చాయి. ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. కిందటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 107 పోస్టుల కంటే పది రెట్లు ఎక్కువగా 1,213 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్‌ను ఇవ్వనుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము పరీక్షలకు సన్నద్ధం కావటం కోసం ప్రభుత్వం కోచింగ్ ఇప్పించాలని కోరుతున్నారు.

మే 15 వరకు దరఖాస్తులు

ఉపాధ్యాయ అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజులు కూడా అదే సమయంలో చెల్లించాలి. మే 20న మాక్ టెస్ట్ నిర్వహిస్తారు. 30న హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని పరీక్షలు పూర్తయిన రెండు రోజులకే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏడు రోజులపాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు తుది కీ, ఆ తర్వాత ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



తృణధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నూజివీడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ హెచ్చరించారు. నూజివీడు మహి ళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో శనివారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహి ంచినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సందర్భంగా విలక్షణమైనటు వంటి తృణధాన్యాలతో ఆహారం ఎలా తీసుకో వాలో తెలుపుతూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా 2024-25 సంవత్సరానికి గానూ కోటి ఇరవై మూడు లక్షల రూపాయల పనిదినాలను కల్పించామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. శనివారం ఆగిరిపల్లి మండ లంలోని కొమ్మూరులో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇంకా 400 మీటర్లు రోడ్డు పనుల కు అనుమతులు ఇవ్వాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. 4.23 లక్షల మంది వేతనదారులకు రూ.312.57 కోట్లు వేతనాలు చెల్లించా మన్నారు. రానున్న మూడు నెల్లో 90 లక్షల రూపాయల పనిదినాలను కల్పించాలనే లక్ష్యం గా ముందుకు వెళుతున్నామన్నారు. అదే విధంగా 2024-25 సంవత్సరంలో రూ.206 కోట్ల రూపాలయతో రోడ్లు, తదితర మౌలిక సదుపా యాలు కల్పించామన్నారు.

ఈ- వేస్ట్‌ను సురక్షితంగా తొలగించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సురక్షితంగా ఈ-వేస్టను రీసైకిల్ చేయడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని నూజి వీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. నూజి వీడు పట్టణంలో ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు అయినా పాత ఎలక్ట్రానిక్ వస్తువులు అయినా పాత టీవీలు, పనిచేయని కంప్యూటర్లు ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా కలెక్షన్ సెంటర్లుకు అందించాలన్నారు. ఈకార్యక్రమ ంలో నూజివీడు మునిసిపల్ శానిటరీ ఇన్స్పె క్టర్ నాగరాజు, వార్డు శానిటరీ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.


చాట్రాయి: ఈ- వ్యర్థాల వలన పర్యావర ణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతున్నదని, వాటి లోని విష పదార్థాలు భూమిలో ఉండి మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు, పంచాయతీ సిబ్బంది ఇళ్ల ప్రభు త్వ కార్యాలయాలు హాస్పటల్స్ ప్రైవేట్ సంస్థల కు వెళ్ళి కంప్యూటర్స్ మొబైల్ ఫోన్లు ఫ్యాన్లు లైట్లు మొదలైన ఈ-వ్యర్థాలను సేకరించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని హోమియోపతి ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రజిత ఆధ్వ ర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై శనివారం అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, విస్మరించబడిన విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరా లను, వాడేసిన కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్‌లు, టెలివిజన్లు, ఉపకరణాలు వంటి పరికరాలు ప్రమాదకరమైన పదార్థాలను కలిగి ఉంటా యని తెలిపారు. అవి సరిగ్గా పారవేయకపోతే పర్యావరణానికి హానికరమన్నారు.

అభివృద్ధిలో చంద్రబాబు ముద్ర

చంద్రబాబు ముఖ్యమంత్రిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు

ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.. సాగునీటి వనరులు, విద్య, వైద్యం, రహదారులపై దృష్టిపెట్టి తమదైన ముద్ర వేశారు.. తమ గ్రామంలో తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులను ఎప్పటికీ మరిచి పోలే మని చంద్రబాబు అభివృద్ధి ప్రదాత అంటూ ప్రజలు తలుచుకుంటూ ఉంటారు.. నేడు ఆయన పుట్టినరోజు.. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల్లో ఆయన హయాంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిలిచిన కొన్ని పనులపై ఆంధ్రజ్యోతి పరిశీలన...

చింతలపూడితో గోదావరి జలాల అనుసంధానం



చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్-2 శంకుస్థాపన స్థలంలో మొక్క నాటుతున్న చంద్రబాబు (ఫైల్ ఫొటో)

చాట్రాయి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2కి 2017 సెప్టెంబరు 17న ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సమీపంలో మొద్దులపర్వ వద్ద అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు శంకుస్థా పన చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో నాగా ర్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని జోన్-2,3 కి సాగునీరు వచ్చే అవకాశాలు సన్నగిల్లడంతో అప్పటి మైలవరం ఎమ్మెల్యే, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామ హేశ్వరరావు కృషితో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్-1 కి 2008లో అప్పటి సీఎం వైఎస్సార్ శంకుస్థా పన చేశారు. ఫేజ్-1 కాలువ చింతలపూడి మండలం యర్రగుంట పల్లి వద్ద ముగుస్తుంది. అక్కడ నుంచి చాట్రాయి మండలం మీదుగా 14 కిలో మీటర్లు కాలువ తవ్వి, చాట్రాయి వద్ద నాగార్జున సాగర్ వేంపాడు మేజర్ కాలువకు లింక్ చేయటానికి, అక్కడ నుంచి వేంపాడు మేజర్ కాలువను 9 మీటర్లు వెడల్పు నుంచి 19 మీటర్లుకు విస్తరించి విస్సన్న పేట మండలం రామచంద్రాపురం వద్ద నాగార్జున సాగర్ 117 హెడ్ రెగ్యులేటర్ దగ్గర గోదావరి జలాలను అనుసంధానం చెయ్యాలని డిజైన్ రూపొందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకానికి రూ 4,909 కోట్లు (1, 2 ఫేజ్‌లకు కలిపి) నిధులు మంజూరు చేసి పనులను పరుగులె త్తించారు. ఫేజ్-2లో సుమారు 60 శాతం, ఫేజ్-1లో 50 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని మూలన పడేసింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు చింతలపూడి ఎత్తిపోతల పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన న్యాయపర మైన చిక్కుల వల్ల పనులు ప్రారంభించలేని పరిస్థితి. ఇటీవల నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ఆగిరిపల్లి మండలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు నుంచి వీలైనంత త్వరగా క్లియరెన్స్ తీసుకొని చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ పథకం ఉపయోగంలోకి వస్తే ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో 5 లక్షల ఎకరాల మెట్ట భూములు గోదావరి జలాలతో సస్యశ్యామలం అవుతాయి.

పంచాయతీ చెరువుకు కలుషిత నీరు

పంట కాలువలోకి పొంగుతున్న డ్రెయిన్ నీరు

స్పందించని అధికారులు..

గ్రామస్థుల ఆవేదన



మంచినీటి చెరువులోకి పంట కాలువ ద్వారా వెళ్తున్న కలుషిత నీరు

ముదినేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ఈడేపల్లి గ్రామంలోని పంచాయతీ మంచినీటి చెరువులోకి పంట కాల్వ ద్వారా కలుషిత నీరు చేరు తున్నది. చెరువుకు నీరు సరఫరా చేసే పంట కాల్వలోకి ఈడేపల్లి మైనర్ డ్రెయిన్ నుంచి మురుగునీరు రావటం వల్ల అదే నీరు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని కలుషితం చేస్తున్నారు. కొరగుంటపాలెం డొంకరోడ్డులో ఈడేపల్లి డ్రెయిన్ కింద నుంచి ప్రవహిస్తున్న పంట కాల్వ ద్వారా పంచాయతీ చెరువుకు, పొలాలకు నీరందుతున్నది. అయితే డ్రెయిన్, పంట కాలువ క్రాస్ అయ్యే ప్రదేశంలో మురుగునీరు పొంగి పంట కాల్వలోకి వచ్చి పడుతున్నది. దీంతో పంట నీరు పూర్తిగా కలుషితమై చెరువుకు సరఫరా అవుతున్నది. మురుగు కాల్వ పొంగకుండా, పంట కాల్వ నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏళ్ల తరబడి పంచాయతీ, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధి కారులకు వినతిపత్రాలు అందించినా ఒక్క శాఖ అధికారి కూడా స్పందించలేదు. దీంతో కలుషితమవుతున్న పంచా యతీ చెరువులోని నీటినే గ్రామస్థులు వినియోగించు కోవాల్సిన దుస్థితి నెలకొంది.

డ్రెయిన్ నీటిని కట్టడి చేయాలి

అబ్బిశెట్టి సురేష్, గ్రామస్థుడు, ఈడేపల్లి



ఈడేపల్లి గ్రామంలోని పంచాయతీ చెరువులోకి పంట కాలువ ద్వారా మురుగు నీరు వస్తున్నది. ఈడేపల్లి డ్రెయిన్, పంట కాల్వ కలిసే చోట మురుగునీరు పొంగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. పంట కాల్వ ఆక్రమణలను కూడా తొలగించాలి.





ఊటుకూరులో స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న సర్పంచ్, కూటమి నాయకులు.. కలిదిండిలో స్వచ్ఛత ర్యాలీ...రావిచర్లలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

గ్రామాల్లో స్వచ్ఛత ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞలు

నూజివీడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నూజివీడు మాజీ ఏఎంసీ ఛైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు అన్నారు. శని వారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రావిచర్ల గ్రామంలో గ్రామస్థులతో ప్రతిజ్ఞ అనంతరం పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను నిర్వహింపజేశారు. పోలసాన పల్లి గ్రామంలో తహసీల్దార్ సుబ్బారావు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ముదినేపల్లి: స్వచ్ఛ దివస్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ముదినేపల్లి మండలంలో శనివా రం కోలాహలంగా జరిగాయి. వడాలిలో జరిగిన స్వచ్ఛ దివస్ ర్యాలీలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఈవోపీఆర్డీ అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. ఊటు కూరులో సర్పంచ్ సుదాబత్తుల వరలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షులు పోసిన పాండురంగారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వ రరావు, ఉపసర్పంచ్ జంపాన సుబ్బలక్ష్మి, కార్యదర్శి మనోజ్ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ముదినేపల్లి గ్రం థాలయంలో జరిగిన స్వచ్ఛ దివస్ కార్య క్రమంలో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, లైబ్రేరియన్ శ్రీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి: స్వచ్ఛత - శుభ్రతను ప్రతి ఒక్క రూ పాటిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన వైపు అడుగులు వేయాలని ఎంపీడీవో కొండలరావు కోరారు. శనివారం కలిదిండిలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతి ప్రసన్న, ఉపసర్పంచ్ ఎం.సత్యనారాయణ, కార్యదర్శులు ఉదయ్ కుమార్, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: స్వచ్ఛ గ్రామాల సాధనకు ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ కోరారు. శనివారం కార్యాదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలను క్లాప్ మిత్రలు శుభ్రం చేశారు. అనంతరం గ్రామాల్లో అవగహన ర్యాలీలు నిర్వహించారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

కైకలూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు అందించే సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేయాలని డివిజన్ లెవెల్ ట్రైనర్ డాక్టర్ ధీరజ్ అన్నారు. శనివారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో కొల్లేటికోట, సీతనపల్లి ప్రాథ మిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎం లకు, వైద్యసిబ్బందికి హెల్త్ ఇన్‌ఫర్మేషన్ మేనే జ్‌మెంట్ సిస్టమ్, మాతాశిశు సంరక్షణ కార్య క్రమాలపై డివిజన్ లెవల్ శిక్షణ కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నెలలో ప్రజలకు ఇచ్చే అన్నిరకాల స్కీంలను సక్రమంగా నమోదు చేయాలని, ప్రతి దానిని ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బందిపై ఉందన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ముసునూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు జరగాలని అంబుడ్స్ పర్సన్ షేక్ అహ్మద్ బాషా అన్నారు. శనివారం కొర్లకుంట పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు చేసిన పనులు ఉన్నాయా? మస్టర్ రికార్డులు తదితర వాటిని బాషా పరిశీలించారు.




గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి.. మూల్లంకలో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులు

చిరస్మరణీయుడు గౌతు లచ్చన్న

పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం జీవిత కాలం కృషిచేసిన చిరస్మరణీయుడు సర్దార్ గౌతులచ్చన్న అని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి సందర్భంగా శనివారం ఆగిరిపల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయన జీవితం నేటి యువతరానికి ఆదర్శమని, దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతులచ్చన్న అని అన్నారు.

నూజివీడు టౌన్: నేటి తరాలకు గౌతు లచ్చన్న జీవితం ఆదర్శమని జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి శివరామకృష్ణ అన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి పురస్కరిం చుకుని నూజివీడు బస్టాండ్ సెంటర్లో ఆయన విగ్రహానికి శివరామకృష్ణ, తదితరులు నివాళులర్పించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీ యాలు నడిపిన నేత లచ్చన్న అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ముదినేపల్లిలో జరిగింది. సంఘ నాయకులతోపాటు తెలుగుదేశం, జనసేన నాయకులు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, శ్రీహరిపురం సర్పంచ్, విగ్రహ దాత పరసా విశ్వేశ్వరరావు, కలిదిండి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా శేషుబాబు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, గౌడ సంఘం అధ్యక్షులు పరసా కనకారావు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పరసా ఏడుకొండలు, ఈడే సుధాకర్, దావు నాగరాజు, శొంఠి నాగరాజు, పరసా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మూల్లంకలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం నాయకులు గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బండి తులసీరావు, పల్లి రామకృష్ణ, బొక్కా భోగేశ్వరరావు, కుడిపూడి వీరబ్రహ్మం, తంగెళ్ల గణపతి, మామిడిశెట్టి నారాయణ, డి.సాయి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి, చనుబండ గ్రామాలలో శని వారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయో ధుడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి నాయకులు పూలమా లలు వేసి నివాళులు అర్పించారు.



చోరీకి పాల్పడిన వ్యక్తులను చూపుతున్న పోలీసులు

ఇద్దరు దొంగల అరెస్టు

ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం

కలిదిండి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్స్ చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది కలసి కలిదిండి మండలంలో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిళ్ల దొంగతనాలపై ప్రత్యేక నిఘా పెట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3.50 లక్షల విలువ చేసి ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవటంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ కె.వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్స్ బి.రమేష్, డి.వడ్డీకాసులు, హోంగార్డు కట్టా శ్రీనులను కైకలూరు సీఐ రవికుమార్ అభినందించారు.

కాళ్లపాలెంలో భూ రీ సర్వే



కలిదిండి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పాలెంలో శనివారం తహసీల్దార్ రామకృష్ణ భూ రీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భూ సమస్యలపై జరుగుతున్న రీ సర్వే లో తప్పులను సరి చేసుకోవా లన్నారు. ఐదు బృందాలు రీ సర్వే చేపడుతున్నాయన్నారు. రైతులు భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్, సర్వేయర్ షమీ, కూటమి నాయకులు ఎస్.సత్యనారాయణ, యర్రంశెట్టి బెనర్జీ, వేణు, వీఆర్వో పమిడేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

నూజివీడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్నటువంటి కక్షి దారులను గుర్తించి రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకునేలా చర్యలు తీసు కోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ అన్నారు. నూజివీడు కోర్టు హాల్ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి పోలీస్, న్యా యవాదులతో ఆమె సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మే 10వ తేదీ జాతీయ లోక్ అదా లత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదకాసీం, ఒకటవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు, రెండవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.శివపార్వతి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌కు సత్కారం

ముదినేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండల తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌ను మండల ఎండీ యూ వాహనాల ఆపరేటర్ల అసోసియేషన్ నాయకులు సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాము అభిలాష్, ఉపాధ్యక్షుడు పర్సాకిషోర్ సభ్యులు రాజు, నాగరాజు శని వారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను కలసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కైకలూరులో నేను బడికిపోతా

కైకలూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే నేను బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ంగా కైకలూరు పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. హెచ్‌ఎం జి శ్రీకృష్ణ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు గాను విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు.

మినుము తక్కువ ధరకు అమ్మవద్దు

ముదినేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మినుము కొనుగోళ్లకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.7400 మద్దతు ధరగా నిర్ణయించిందని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా తెలిపారు. పెయ్యేరులోని రైతు సేవా కేంద్రంలో శనివారం నిర్వహిం చిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశి ంచిన మద్దతు ధర కంటే తక్కువగా మినుము పంటను అమ్ముకో వలసిన అవసరం లేదన్నారు. దేవపూడి సొసైటీలో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రంలో అమ్మి మద్దతు ధర పొందవచ్చునన్నారు. ప్రభుత్వానికి అమ్మదలచిన రైతులు ముందుగా తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయాలని కోరారు.

అప్పారావుపేట పాఠశాల వార్షికోత్సవం

ముదినేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అప్పారావుపేట ఎలిమెంటరీ పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రెడ్డి కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో కె.నరేష్ కుమార్‌ను సన్మానించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముదినేపల్లి డీసీ వైస్ ఛైర్మన్ హనుమార పేర్నీడు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్ బహుమతులు అందజేశారు.

సారా తయారీదారులపై కేసులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 56 కేసులు నమో దు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఏప్రిల్ నెలలో నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా మొత్తం 56 కేసులు నమోదు చేసి 78 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.


ఉచిత శిశు ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ నరేంద్రసింగ్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో 5 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచిత ఆధార్‌కార్డు నమోదు కేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్ ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు పుట్టగానే ఆధార్‌కార్డు నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని, ఆధార్‌కార్డు లేని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ కార్డుకి కూడా అర్హులు కారన్నారు. ఆధార్‌కార్డు కావలిసిన వారు తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డు తీసుకొని శిశువు జన్మ ధృవీకరణ పత్రాన్ని తీసుకొని రావాలని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475